

సత్యసాయికి హారతి..



స్వర్ణరథంలో సత్యసాయి ప్రతిమ



బాబా మహాసమాధి



వేదికపై ఉపరాష్ట్రపతి, సీఎంలు, మంత్రులు, ట్రస్టు సభ్యులు

కదిలింది సాయిరథం

పుట్టపర్తిలో మార్మోగిన సాయినామం

- అట్టహాసంగా సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు
- ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ తదితరుల హాజరు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



రండి సామి వద్దకు..

పుట్టపర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి నామస్మరణతో పుట్టపర్తి మార్మోగింది. పట్టణ వీధులన్నీ కిటకిటలాడాయి. ప్రశాంతి నిలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. హిల్‌వ్యూ స్టేడియంలో సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. స్వర్ణరథంపై సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. సత్యసాయి స్వర్ణరథం స్టేడియంలోకి వస్తుండగా గాయకుడు మనో తన పాటతో అరవిందు డోలు వాయిద్యంతో సాగింది. గాయకుల పాటకు భక్తులు లీనమై పులకించిపోయారు. శాంతి వేదిక వరకు సాగిన స్వర్ణ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు

(మిగతా 7వ పేజీలో...)


సేవల్లో చూపుదాం..



సంఘర్షణలు, ఒత్తిడులతో నిండిన నేటి ప్రపంచానికి భగవాన్ బోధించిన ప్రేమ, ఐక్యత, సేవ వంటి విలువలు మరింత అవసరం. సేవ మానవత్వాన్ని కలుపుతుంది. ప్రేమ ద్వేషాన్ని జయిస్తుంది. కుటుంబాల్లో, సమాజంలో, దేశంలో శాంతిని పెంపొందించడం మనందరి బాధ్యత. భగవాన్ వారసత్వాన్ని మాటల్లో కాకుండా సేవల్లో కొనసాగించాలి.

- ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

పూర్తి వివరాలు మెయిన్‌లో



డ్రోన్‌షో...

మనం చూసిన దైవం..

దేవుళ్లు ఎక్కడో ఒక చోట అవతరిస్తారు. భగవాన్ సత్యసాయి ఈ పుణ్యభూమిని ఎంచుకున్నారు. చిత్రావతి నది ఒడ్డున పుట్టపర్తిని ఆధ్యాత్మికతకు, దైవత్వానికి నిలయంగా మార్చారు. మానవ రూపంలో మనం చూసిన దైవం ఆయన. తన మనో దర్శనం ద్వారా దేశ విదేశాల నుంచి సంపన్నులు, ప్రముఖులను ఆయన సేవా మార్గం అనుసరించేలా చేశారు. డబ్బు, పదవి, పేరు ఉన్నవారు ఎక్కడా లేని ప్రశాంతత పుట్టపర్తిలో పొందారు.

- సీఎం చంద్రబాబు

జీవితాల్లో వెలుగులు..

భగవాన్ సత్యసాయి ప్రజల్లోనే దేవుడిని చూశారు. ప్రేమతో వారిని గెలుచుకున్నారు. ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందనేది బాబా సందేశం. ప్రభుత్వాలు సేవలు అందించలేని చోటా బాబా సేవలు అందించారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించడం ద్వారా సత్యసాయి ట్రస్ట్ లక్షలాది మంది జీవితాలకు వెలుగు ఇచ్చింది. ప్రభుత్వాలకు సరితూగే స్థాయిలో, కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలకు మించి సేవలను ట్రస్ట్ అందిస్తోంది.

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

కొడికొండ చెరువుకు గండి



గండి పడిన చోట వృథాగా వెళ్లున్న నీరు

చిలమత్తూరు మండలంలోని కొడికొండ పాతచెరువుకు ఆదివారం గండి పడటంతో నీరంతా పంట పొలాలపై వృథాగా పారింది. చెరువు తూము పక్కన పెద్ద గోతి పడి చెరువు కట్ట కుంగిందని రైతులు చెబుతున్నారు. దాంతో గండిపడి చెరువు నీరు పెద్దఎత్తున పంటపొలాలపై వెళుతూ చిత్రావతి నదిలో కలుస్తోందని వాపోయారు. వెంటనే రైతులు గండిపడిన ప్రదేశంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో గండి పూడిపోయి, నీటి వృథా కాస్త తగ్గింది. చెరువుకి ఉన్న రెండు తూముల్లో ఒకదానిని కొందరు గుప్తనిధుల కోసం తవ్వి ధ్వంసం చేశారని అన్నదాతలు చెబుతున్నారు. మరో తూము వద్ద గతంలో చెరువు తెగినపుడు మరమ్మతులు సరిగా చేయకపోవడంతో అక్కడే నీరు లీకేజీ అవుతోందన్నారు. చెరువు కింద 65 ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో మొక్కజొన్న, వరి పంటలు సాగు చేస్తున్నారు. అధికారులు వెంటనే చెరువుకు మరమ్మతులు చేపట్టి, నీటి వృథాని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

-చిలమత్తూరు, ఆంధ్రజ్యోతి

ఉండిపోనీ.. ఈ సాయంత్రం..




సూర్యకాంతిలో గొట్లూరు చెరువు మరువ పారుతున్న దృశ్యం

సాయంకాలం భానుడి కిరణాలు ఎర్రగా ప్రసరిస్తున్నాయి. చెరువు మరువపై నుంచి నీరు పారుతోంది. రవి కిరణాలు, జల సోయగాలను చూసిన కనులదే భాగ్యం. ఆ ప్రకృతి అందాన్ని ఆస్వాదించిన ప్రతి హృదయం.. 'ఈ సాయంత్రం ఇలాగే ఉండిపోనీ' అని కోరుకుంటుంది. ధర్మవరం మండలంలోని గొట్లూరు చెరువు మరువ వద్ద ఆదివారం సాయంత్రం ఈ రమణీయ చిత్రం కనిపించింది.

-ధర్మవరం రూరల్, ఆంధ్రజ్యోతి

పేదల భూములపై గద్దల కన్ను

- డి. పట్టాలు, ప్రభుత్వ భూముల కొనుగోలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ శాఖ





బెంగళూరు ధనికులు మల్లిరెడ్డిపల్లి వద్ద కొనుగోలు చేసిన డి. పట్టా భూములు

తనకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేదల భూములపై పెద్దల కన్ను పడింది. వైసీపీ పాలనలో చుక్కల భూములు, ప్రభుత్వ భూములను నిషేధాంక్షల నుంచి తొలగించడానికి ప్రయత్నాలు జరిగాయి. దీంతో ఎక్కడో పట్టణాల్లో ఉంటున్న కొందరు కోటీశ్వరులు డి. పట్టాలు, పేదల భూములపై కన్నేశారు. ఈక్రమంలో తమ అనుచరులు, దళారులను రంగంలోకి దింపారు. అంతకు ముందే రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి ఏవి చుక్కల భూములు, ఏవి 22ఎలో ఉన్నాయన్న వివరాలు సేకరించుకున్నారు. ఈనేపథ్యంలో ఎకరా భూమి రూ.లక్ష, రూ.1.5 లక్షల నుంచి పెంచి ప్రస్తుతం రూ. నాలుగు లక్షలతో కొనుగోలు చేస్తున్నారు. భూములు రిజిస్టర్ కాకున్నా, పర్వాలేదంటూ 99 సంవత్సరాల లీజుకు అగ్రిమెంట్లు తయారు చేసుకుని, పేదల భూములు స్వాధీనం చేసుకుంటున్నారు. ఇలా మండల వ్యాప్తంగా ఇప్పటికే వందలాది ఎకరాల భూములు ధనికుల చేతుల్లోకి వెళ్లినట్లు సమాచారం.

చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం

మండలంలోని మల్లిరెడ్డిపల్లి ప్రాంతంలో సర్వే నంబర్ 63, 88, 89 లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను బెంగళూరుకు చెందిన ధనికులు కొనుగోలు చేశారు. సర్వేలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలిసినా సంబంధిత రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలకు ఉపక్రమించడం లేదు. గత పదేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పెట్టుబడులు కూడా దక్కక అనేకమంది పేదలు భూములు సాగు చేయకుండా వదిలేశారు. ఈక్రమంలోనే ఆ భూముల నుంచి ఏం ప్రయోజనం లేదని భావించిన అనేకమంది యజమానులు వాటిని అయినకాడికి అమ్మేసి పట్టణాల్లో ఉంటున్న తమ పిల్లల వద్దదకు వెళ్లిపోతున్నట్లు తెలిసింది. ఇలాంటి భూములు కొన్న ధనికులు వాటికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వం పేదలకిచ్చిన భూములు పెద్దలపాలు కాకుండా చూడాల్సి ఉంది.

ప్రభుత్వ భూములు అమ్మడం, కొనడం నేరం

ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా సేకరించి, నిరుపేదలకు పంచిన ల్యాండ్ సీలింగ్ భూములు, డి. పట్టా భూములు అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పేదలు, ప్రభుత్వ భూముల జోలికొస్తే సహించేది లేదు.

- షాబుద్దీన్, తహసీల్దార్

కారు పార్క్ చేశారని దాడి

- మహిళ దండంపెట్టి వేడుకున్నా వదల్లేదు
- కదిరిలో అమానవీయ ఘటన



ఘర్షణ ప్రదేశంలో ఏడుస్తున్న మహిళ, కారు యజమాని బంధువులను చితకబాదుతున్న దృశ్యం

కదిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సప్తగిరి హోటల్ వద్ద పార్కింగ్ విషయంలో ఆదివారం గొడవ జరిగింది. హోటల్ ముందు కారు ఆపిన వ్యక్తులను హోటల్ సిబ్బంది చితకబాదారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు, కదిరిలోని అమీన్ నగర్‌కు చెందిన ధనుంజయ హిందూపురంలో పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన తండ్రి సంవత్సరీకం ఆదివారం ఉండడంతో బంధువులు కదిరికి వచ్చారు. వారంతా సప్తగిరి హోటల్ వద్ద ఉన్నామని చెప్పారు. దీంతో తన కారులో సప్తగిరి హోటల్ వద్దకు ధనుంజయ వచ్చారు. కారును సప్తగిరి హోటల్ ముందు ఉంచారు. బంధువులు సప్తగిరి హోటల్‌లో లేకపోవడంతో పక్కనే ఉన్న లక్ష్మీ హోటల్ వద్దకు వెళ్లి విచారించారు. దీనిని గమనించిన సప్తగిరి హోటల్ యజమాన్యం, కారు తీయాలని గొడవపడింది. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్తా ముదిరి దాడి జరిగేదాకా వెళ్లింది. హోటల్ సిబ్బందితోపాటు చుట్టుపక్కలవారు కూడా వచ్చి ధనుంజయ, ఆయన బంధువులను చుట్టుముట్టి విచక్షణారహితంగా కొట్టారు. ధనుంజయ బంధువులను వెతికి మరీ కొట్టారు. చొక్కాలను చించేశారు. వారిలో ఓ మహిళ వదిలేయాలని ఏడుస్తూ వేడుకున్నా వినిపించుకోలేదు. దెబ్బలు తిన్నవారంతా దండం పెట్టి సారీ చెబుతున్నా, కొట్టడం ఆపలేదు. ట్రాఫిక్‌లో ఉండే కానిస్టేబుల్ అక్కడికి చేరుకుని హోటల్ సిబ్బందిని వారించే ప్రయత్నం చేసినా.. పట్టించుకోలేదు. అయ్యప్ప మాలలో ఉన్న వ్యక్తిని కూడా చితకబాదారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ ఘటనా స్థలానికి చేరుకుని, అందరినీ చెదరగొట్టారు. దాడికి పాల్పడినవారిని అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు. హోటల్ సిబ్బంది రెడ్డి నరసింహ, మురళి, బాదుల్లా, శేషగిరి స్వామి, న్యాయవాది శివ, మరికొంతమందిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి 7

టీడీపీ నాయకుడి డ్రిప్ పరికరాలు ధ్వంసం
- ట్రాక్టరును డ్యాంలోకి తోసేసిన దుండగులు 7

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మ ల్లీశ్వరస్వామికి, విరూపాక్షి స్వాములను ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూజలు చేశారు. వచ్చిన భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

నాసిన్‌లో ఉపరాష్ట్రపతి

మంత్రి లోకేశ్‌తో కలిసి సందర్శన

గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని నాసిన్‌ను ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఆదివారం సందర్శించారు. ట్రైనీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. శిక్షణ పొందుతున్నవారినుద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. పుట్టపర్తి నుంచి వచ్చిన వారికి నాసిన్‌లో ఘనస్వాగతం లభించింది.

(వివరాలు మెయిన్‌లో)



నాసిన్‌లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మంత్రి నారా లోకేశ్

రైల్వే అధికారుల మధ్య ఆధిపత్య పోరు
- డీజిల్, ఎలక్ట్రికల్ సీనియర్ డీఎంఈ మధ్య ముదిరిన వివాదాలు
- ఉన్నతాధికారుల విచారణ? 7

ఆస్పత్రి ధ్వంసం
- వైసీపీ నాయకుడి దౌర్జన్యం

రైల్వే అధికారుల మధ్య ఆధిపత్య పోరు

● డీజిల్, ఎలక్ట్రికల్ సీనియర్ డీఎంఈ మధ్య ముదిరిన వివాదాలు

● ఉన్నతాధికారుల విచారణ?

గుంతకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజనల్ కేంద్రంలోని ఇద్దరు హెచ్‌ఓడీల మధ్య జరుగుతున్న ఆధిపత్యపోరు చిలికి, చిలికి గాలివానగా మారింది. స్థానిక డీజిల్ షెడ్, ఎలక్ట్రికల్ లోకో షెడ్ హెడ్ ఆఫ్ ద డిపార్టుమెంట్ అధికారులైన సీనియర్ డీఎంఈ (డీజల్) మంగాచార్యులు, సీనియర్ డీఈఈ వీరయ్య మధ్య ఏర్పడిన వివాదాలు పీక్ స్టేజ్‌కు చేరాయి. మంగాచార్యులుకు ప్రమోషన్ల కారణంగా సీనియర్ డీఎంఈగా ఉన్నతి లభించగా, వీరయ్య ఇండియన్ రైల్వే సర్వీస్ ద్వారా వచ్చిన అధికారి కావడం కూడా వీరి మధ్య పొసగకపోవడానికి కారణంగా కనిపిస్తోంది. ఈ ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య ఏర్పడిన ఘర్షణ వాతావరణానికి తోడు ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో వారం కిందట జరిగిన ఘటన విచారణకు దారితీసింది. దీనిపై స్పందించిన డీఆర్ఎం ఈ ఇద్దరు అధికారులపై విచారణకు ఆదేశించారు.

సమస్యకు కారణమిదీ..:

గుంతకల్లు రైల్వే డివిజన్ కేంద్రంలో 60 ఏళ్లుగా డీజిల్ షెడ్ ద్వారా డీజిల్ ఇంజన్ల నిర్వహణ, మరమ్మతుల కార్యక్రమం నడుస్తోంది. కాగా మారుతున్న సాంకేతికత కారణంగా గుంతకల్లులో 150 ఎలక్ట్రికల్ లోకోలను మరమ్మతులు చేసే విద్యుత్ లోకో షెడ్‌ను నిర్మించారు. ఈ నేపథ్యంలో డీజిల్ షెడ్‌లో డీజిల్ లోకోల సంఖ్య తగ్గిపోయి వాటి స్థానంలో దాదాపు 150 విద్యుత్ లోకోలు వచ్చి చేరాయి. ఆ విద్యుత్ లోకోలను నిర్వహించే బాధ్యత సీనియర్ డీఎంఈ (డీజల్) నేతృత్వంలోనే చేపట్టారు. కాగా సీనియర్ డీఎంఈ మరో నాలుగు నెలల్లో రిటైరు కానుండగా, గత నెలలో విద్యుత్ లోకో షెడ్‌కు సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు పోస్టును సృష్టించి సీనియర్ డీఈఈగా వీరయ్యకు ప్రమోషన్ ఇచ్చి ఇక్కడకు పోస్టింగ్ ఇచ్చారు. సీనియర్ డీఈఈగా విధుల్లో చేరిన వీరయ్య తనకు షెడ్‌లో ప్రత్యేక చాంబర్ కావాలని, విద్యుత్ లోకోలను తనకు అప్పగించాలన్న విషయంగా సీనియర్ డీఎంఈ (డీజిల్) మంగాచార్యులుతో స్పర్థ ఏర్పడినట్లు సమాచారం.

అధికారులపై విచారణ

మరమ్మతులు చేయాల్సిన విద్యుత్ లోకోలను తేవడానికి ఉపయోగించే షంటింగ్ డీజిల్ ఇంజిన్‌ను సీనియర్ డీఎంఈ (డీజల్) మంగాచార్యులు ఇవ్వకుండా ఆపేశారని సీనియర్ డీఈఈ వీరయ్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తన అనుమతి లేకుండా డీజిల్ ఇంజిన్‌ను సీనియర్ డీఈఈ ఎలా వాడుకుంటారని కినుక వహించిన సీనియర్ డీఎంఈ దానిని ఉద్దేశపూర్వకంగా ఇవ్వడంలేదని చేసిన ఆరోపణల విషయంగా ఈ ఇద్దరు అధికారుల మధ్య వివాదం తారాస్థాయికి చేరి, మాటామాటా పెరిగినట్లు సమాచారం. ఈ వివాదం జోనల్ హెడ్ క్వార్టర్సుకు, ఆపైన రైల్వే బోర్డు వరకూ వెళ్లినట్లు తెలిసింది. దీనిపై డీఆర్ఎం సీఎస్ గుప్తా విచారణకు ఆదేశించగా ఏడీఆర్ఎం ద్వారా శని, ఆదివారాల్లో ఈ ఇద్దరు అధికారులను విడివిడిగా పిలిచి ప్రశ్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయంగా ఉన్నతాధికారుల వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆదివారం కావడంతో వారు అందుబాటులోకి రాలేదు.

చెన్నై దాహార్తి తీర్చిన సత్యసాయి

● తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

పుట్టపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చెన్నై దాహార్తిని తీర్చిన మహనీయుడు సత్యసాయి బాబా అంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సందేశంలో పేర్కొన్నారు. సత్యసాయి శత జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి పంపిన సందేశాన్ని ఆ రాష్ట్ర మంత్రి శేఖర్ బాబు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌కి అందజేశారు. పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి సందేశాన్ని వ్యాఖ్యాత చదివారు. చెన్నై దాహార్తి తీర్చేందుకు, తమిళనాడు సాగు అవసరాలకు సత్యసాయి కృష్ణా జలాలు అందించారని కొనియాడారు. సత్యసాయి అందిస్తున్న ఉచిత వైద్యం, విలువలతో కూడిన విద్య, గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు ఎనలేనివన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు, సేవా సంస్థలు నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరంరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా ఉంటుందని, ఇందులో 10కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ఎంపికైన వారు పెనుకొండ, కడప, పాలసముద్రం, అనంతపురం, బెంగళూరు ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. పదో తరగతి నుంచి పీజీ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వారు అర్హులని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు నైపుణ్యం.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి




సురేష్, సల్లప్ప, తిమ్మారెడ్డి (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బేల్దారి పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో ఇద్దరు మృతి చెందగా.. నడుచుకుంటూ వెళుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు, ద్విచక్ర వాహనం బోల్తాపడి మరొకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన సురేష్ (48), మానిరేవు గ్రామానికి చెందిన సల్లప్ప (38) ఇద్దరూ బేల్దారి పని ముగించుకుని శనివారం రాత్రి 12 గంటల సమయంలో ద్విచక్రవాహనంలో ఇళ్లకు బయల్దేరారు. గోళ్ల సమీపంలో అతివేగంగా అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ చెల్లాచెదురుగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సురేష్‌కు భార్య అరుణ, పిల్లలు అజయ్, నందిని ఉన్నారు. సల్లప్పకు భార్య అనిత, పిల్లలు అనిల్, అంజి ఉన్నారు. ఇరు కుటుంబాల్లో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో అనాథలుగా మిగిలారు. ఒకే ఇంటికి చెందిన అక్కా చెల్లెళ్లు అరుణ, అనితను పెళ్లి చేసుకున్నారు. మృతులు ఇద్దరూ తోడళ్లుల్లు. కారు అనంతపురం నగరానికి చెందినదిగా గుర్తించారు. కారు, ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని దొడగట్ట రోడ్డులో శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న తిమ్మారెడ్డి(38) అనే వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తిమ్మారెడ్డితో పాటు అశ్వర్థ, రామాంజనేయులు ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లారు. ముగిసిన తర్వాత వాకింగ్ చేద్దామంటూ ముగ్గురూ రోడ్డుపైకి వచ్చారు. దొడగట్ట నుంచి ద్విచక్రవాహనంలో భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి వచ్చి ఢీ కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తిమ్మారెడ్డిని అనంతపురం తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య భారతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం బోల్తాపడి..

●గోరంట్ల: మండలంలోని పుట్టపర్తి రహదారిలో కరావులపల్లితండా సమీపంలోనిబైపాస్‌రోడ్డులో ద్విచక్రవాహనం బోల్తాపడి దూదోళ్ల వెంకటేష్ (35) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. గోరంట్ల మండలంలోని వానవోలు ఎస్సీ కాలనీకి చెందిన దూదోళ్ల నారాయణ కుమారుడు వెంకటేష్ ద్విచక్రవాహనంపై పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామంలోని భార్య, పిల్లలను తీసుకురావడానికి వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం తగిలి చెవి, ముక్కు నుంచి రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ షేక్షావలి తెలిపారు.

బొలెరో ఢీకొని ఒకరు..

ఉరవకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కణేకల్లు మండలం సొల్లాపురం గామానికి చెందిన పవన్ (30) మరణించాడు. రాము తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరూ వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి సమీపంలో బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన బొలెరో ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వీరిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పవన్ మరణించాడు. పోలీసులు ఘటనపై ఆరా తీస్తున్నారు.

కదిలింది సాయిరథం..



మహారథం ముందు ఆర్‌జే రత్నాకర్



కళశాలతో వస్తున్న మహిళలు

(5వ పేజీ తరువాయి)

ఎగబడ్డారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డితోపాటు దేశవిదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఉదయం హిల్ వ్యూ స్టేడియంలో ప్రముఖ గాయకుడు మనో, శివమణి సంగీత విభావరితో ఆలరించారు. అన్నిరాష్ట్రాల సత్యసాయి భక్త బృందాలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. సింగర్ మనో పాట పాడుతుండగా.. సత్యసాయి స్వర్ణరథం స్టేడియంలోకి ప్రవేశించింది. దీంతో భక్తుల సాయినామంతో స్టేడియం దద్దరిల్లింది. సాయి రథం ముందు వేదపారాయణం చేస్తూ సాగారు. వేదం, నగర సంకీర్తన, భజన ఒకే వేదికపై ఆధ్యాత్మికత, ఏకత్వాన్ని ప్రతిబింబించాయి. స్వర్ణ రథంపై దివ్యకాంతులతో విరాజిల్లుతున్న సత్యసాయి బాబా దర్శనంతో భక్తులు తన్మయత్వం పొందారు.

సాయి కుల్వంతులో..

సత్యసాయి శత జయంతి వేడుకలను ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనం, భక్తి నివేదనం పేరిట భక్తి గీతాల ఆలాపన చేపట్టారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ప్రశాంతి నిలయం పూర్తిగా నిండిపోయింది. అందులో చోటులేక బయటే భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. పుట్టపర్తి వీధులు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సెంట్రల్ ట్రస్టు సభ్యులు, సేవాదళ్, జిల్లా అధికార, పోలీసు యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నాయి. దీంతో బాబా శతజయంతి ఉత్సవాలు దిగ్విజయంగా ముగిశాయి. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు నారాయణ సేవతోపాటు పలువురు భక్తులు అన్నదానం చేశారు.

ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. వేడుకల మొదటి రోజు నుంచి ప్రముఖులు సందర్శిస్తున్నారు. దీంతో భద్రత కల్పించడం పోలీసు శాఖకు సవాల్‌గా మారింది. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ నిరంతరం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ.. గడిపారు.



భక్తులతో కిటకిటలాడుతున్న హిల్‌వ్యూ స్టేడియం



ప్రత్యేక ఆకర్షణగా ప్రవేశ ద్వారం



సాంస్కృతిక కార్యక్రమాలు





తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, అనగాని సత్యప్రసాద్





ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే సింధూరారెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

పుట్టపర్తి టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలలో పాల్గొనడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం పుట్టపర్తికి విచ్చేశారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో తెలంగాణ ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్.రాజు, హిందూపురం ఎంపీ బీకే.పార్థసారధి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్‌లు పుష్పగుచ్చాలతో ఘనస్వాగతం పలికారు. మంత్రి సవిత తెలంగాణ ముఖ్యమంత్రికి జాతీయ చిహ్నం అయిన అశోక స్తంభంను బహూకరించారు.

రేవంత్ రెడ్డితో సమావేశం: సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి ఆదివారం పుట్టపర్తి చేరుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. విమానాశ్రయం లాంచ్‌లో సమావేశమై శత జయంతి ఉత్సవాలకు వచ్చినందుకు రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చంద్రబాబుకు వీడ్కోలు




సీఎం చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న మాజీ మంత్రి పల్లె, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, కందికుంట వెంకటప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు వీడ్కోలు పలికారు. పుట్టపర్తి విమానాశ్రయంలో మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్.రాజు, హిందూపురం ఎంపీ బీకే.పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులతో పాటు పలువురు నాయకులు, అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.

అంధకారంలో భవిత..!

- చీకట్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు పాఠాలు
- భవిత కేంద్రాన్ని అప్పగించని కాంట్రాక్టర్

కనగానపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా.. అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సొంత భవనం ఉన్నా పిల్లలను చీకటి గదిలో పెట్టి చదువులు చెబుతున్న దయనీయ స్థితి ఇది. ప్రభుత్వం పిల్లల కోసం మంజూరు చేసిన నిధులతో పక్కా భవన నిర్మాణం పూర్తి చేసినా.. అధికారులకు అప్పగించకుండా, సొంత అవసరాలకు వాడుకుంటున్నాడో కాంట్రాక్టర్. బుద్ధిమాంద్యం, దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రతి మండల కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రాన్ని నిర్వహిస్తోంది. ఇందులో ఐఈఆర్‌పీలను నియమించి ప్రత్యేక అవసరాల పిల్లలకు తరగతులు నిర్వహిస్తున్నారు. కనగానపల్లి మండల కేంద్రంలో 15 మంది దివ్యాంగ పిల్లలు ఉన్నారు. వీరికి ప్రత్యేక భవనం లేక పోవడంతో ప్రాథమిక పాఠశాలలో ఓ గదిని తీసుకుని చదువు చెబుతూ.. ఆటలు ఆడిస్తున్నారు. వారానికి ఒకసారి ఫిజియోథెరపిస్టు కేంద్రానికి వచ్చి అవసరమున్న పిల్లలకు వ్యాయామాలు చేయించి, తల్లిదండ్రులకు మెళకువలు నేర్పిస్తారు. వీరి అవసరాలను గుర్తించిన గత తెలుగుదేశం ప్రభుత్వం సర్వశిక్షా అభయాన్ పథకం ద్వారా 2017-2018లో భవత కేంద్రానికి పక్కా భవన నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టరు భవనాన్ని విడతల వారిగా పూర్తి చేశాడు. వైసీపీ ప్రభుత్వంలో భవిత కేంద్రాలపై పర్యవేక్షణ లేకపోవడంతో భవనాన్ని సొంత అవసరాలకు వాడుకుంటున్నాడు. భవనం పూర్తయినప్పటికీ పిల్లలకు పాత పాఠశాల భవనంలోని చీకటి గదిలో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై సమగ్ర శిక్ష జేఈ చంద్రమోహన్ వివరణ కోరగా.. కాంట్రాక్టరుకు బిల్లు పెండింగ్ ఉందని తమకు తాళాలు ఇవ్వలేదని అన్నారు.



చీకటి గదిలో చదువుకుంటున్న ప్రత్యేక అవసరాలుగల పిల్లలు

భవనాన్ని అప్పగించమని ఆదేశించాం

కనగానపల్లి నూతన భవితా కేంద్రాన్ని 10 రోజుల క్రితమే తనిఖీ చేయడం జరిగింది. పెండింగ్ పనులు పూర్తి చేసి వారంలో భవనాన్ని సంభదిత అధికారులకు అప్పగించమని కాంట్రాక్టర్, ఇంజనీర్‌ను ఆదేశించడం జరిగింది. దీనిపై అలసత్యం వహిస్తే సహించేది లేదని, కేంద్రాన్ని తెరిచేందుకు చర్యలు చేపడుతామన్నారు.

- దేవరాజు, ఏపీసీ, సమగ్ర శిక్ష

ఆస్పత్రి ధ్వంసం

● వైసీపీ నాయకుడి దౌర్జన్యం

● వాటాదారుల మధ్య విభేదాల నేపథ్యంలోనే..

అనంతపురం వైద్యం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వాటాల్లో పంచాయితీ నేపథ్యంలో అనంతపురంలోని సాయినగర్‌లో గల శ్రీనివాసా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ధ్వంసం చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయినగర్ మూడో క్రాస్‌లో శ్రీనివాసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. అందులో శ్రీనివాసరావు, వైసీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి, రాఘవేంద్ర, న్యాయవాది శ్రీలతారెడ్డి వాటాదారులు. ఈ నేపథ్యంలో వాటాల విషయమై సత్యనారాయణరెడ్డి ఆగ్రహించారు. తన వాటా వెనక్కివ్వాలనీ, లేకుంటే వాటాదారుగా చేర్చుకోవాలని డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సత్యనారాయణరెడ్డి.. తన అనుచరులతో వెళ్లి హాస్పిటల్‌పై దాడి చేశాడు. మొత్తం ధ్వంసం చేశారు. ఆస్తినష్టం, దాడిచేసిన వారు తదిర వివరాలు కేసు విచారణలో వెల్లడవుతాయని సీఐ శ్రీకాంత్ పేర్కొన్నారు.

మూడేళ్లుగా వివాదం

అనంతపురం జిల్లా కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామ వైసీపీ మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి. అనంతపురంలో శ్రీనివాస ప్రైవేటు హాస్పిటల్ భాగస్వామిగా ఉన్నాడు. మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అనుచరుడిగా, నాయకునిగా వైసీపీ ప్రభుత్వంలో చలామణి అయ్యాడు. అనంతపురం అర్బన్ వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అనుచరుడిగా నగరంలో అక్రమాలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీనివాసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బ్రాంచ్-2ని సాయినగర్ మూడో క్రాస్‌లో ఏర్పాటుచేశారు. ప్రారంభానికి అంతా సిద్ధం చేశారు. వాటాల విషయంలో సత్యనారాయణరెడ్డి వాదిస్తూ వస్తున్నారు. మూడేళ్లుగా వివాదం నడుస్తోంది. దీనిపై వైసీపీ హయాంలో అప్పటి మంత్రి, పోలీసు ఉన్నతాధికారి పంచాయితీ కూడా చేసినట్లు తెలిసింది.

రూ.3.5కోట్ల నష్టం

వైసీపీ నేత సత్యనారాయణరెడ్డి తన అనుచరులతో చేసిన దాడితో రూ.3.5కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని లాయర్ శ్రీలతారెడ్డి ఫిర్యాదు చేశారు. ఫర్నీచర్, ఏసీలు, ఎలివేషన్ వర్క్స్ ఇలా అన్నింటినీ ధ్వంసం చేసినట్లు కేసు పెట్టారు. ఆ మేరకు కేసు నమోదుచేసి, దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.



ధ్వంసమైన ఆస్పత్రి లోపలి భాగం

టీడీపీ నాయకుడి డ్రిప్ పరికరాలు ధ్వంసం

● ట్రాక్టరును డ్యాంలోకి తోసేసిన దుండగులు



ధ్వంసమైన పరికరాలు



డ్యాంలో వదిలిన ట్రాక్టర్

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జరుట్లరాంపురంలో టీడీపీ బూత్ కన్వీనర్ రామాంజనేయులు పొలంలోని వ్యవసాయ పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రామాంజనేయులు భార్యతో కలిసి శనివారం ట్రాక్టర్‌లో తోటలోని పొలం పనులకు వెళ్లారు. పొలం పనులు చేస్తున్న సమయంలో బంధువులు చనిపోయినట్లు సమాచారం వచ్చింది. దీంతో పొలం పనులు వదిలేసి చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లికి వెళ్లారు. ఆదివారం ఉదయం అతడి ట్రాక్టర్ పెనకచెర్ల డ్యాంలో ఉండడాన్ని గుర్తించి సమాచారమందించారు. పొలంలోని డ్రిప్ పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సుమారుగా రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. సంఘటనాస్థలాన్ని సీఐ మహానంది, ఎస్ఐ నాగస్వామి పరిశీలించారు. తనపై కక్షతోనే గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టరును తోసుకెళ్లి వదిలారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

న్యూస్ బాక్స్

ఇంట్లో షార్ట్ సర్క్యూట్

● రూ. 3లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడి ఆవేదన



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన బీరువా, ఫ్రిడ్జ్

ఓబుళదేవరచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం(నల్లగుట్లపల్లి)గ్రామానికి చెందిన బీరే కరుణాకర్ నాయుడు స్వగృహంలో శనివారం అర్ధరాత్రి విద్యుత్‌షాట్ సర్క్యూట్ అయింది. ఈ ప్రమాదంలో రూ. 3లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. వెంకటాపురానికి చెందిన బీరే కరుణాకర్ నాయుడు, కుటుంబసభ్యులు ప్రతి రోజులాగానే శనివారం రాత్రి ఆరుబయట నిద్రించారు. ఇంట్లో వృద్ధులైన బాధితుడి తల్లిదండ్రులు నిద్రిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి ఫ్రిడ్జ్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి, ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఇది గుర్తించిన కరుణాకర్‌నాయుడు ఇంట్లో ఉన్న తల్లిదండ్రులను బయటికి తీసుకొచ్చాడు. ఆ లోగా ఇంట్లోని బీరువా, తిండి గింజలు, బట్టలు, అన్ని కాలి బూడిదయ్యాయి. దీంతో కట్టుబట్టలతో మాత్రమే ఉండాల్సి వచ్చిందని కరుణాకర్‌నాయుడు వాపోయాడు. అధికారులు, ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చెత్త విషయంలో గొడవ

ధర్మవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయినగర్‌లో ఆదివారం సాయంత్రం కాలువలో చెత్త వేసే విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. దాడిలో కృష్ణమ్మ, శంకరయ్య దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు శేఖర్, గాయత్రిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

ముదిగుబ్బ, నవంబరు, 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొడవాండ్లపల్లిలో ఆదివారం విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి చెందింది. కొడవాండ్లపల్లికి చెందిన అంకే కుళ్లాయప్పకు చెందిన పాడి ఆవు ఆదివారం మేతకు వెళ్లింది. గ్రామ శివార్లలో ప్రమాదకరంగా కిందపడి ఉన్న విద్యుత్ తీగలను తగిలి విద్యుదాఘాతంతో మరణించిందని బాధితుడు కుళ్లాయప్ప తెలిపారు. దీంతో దాదాపు రూ. 90వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు. ఆవు మృతికి స్థానిక విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

'సచివాలయ ఉద్యోగి మృతికి... బాధ్యులపై చర్యలు తీసుకోండి'

ధర్మవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లోని మున్సిపల్ కార్పొరేషన్‌లో సచివాలయ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న నూకరాజు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ విలేజ్ వార్డ్ సెక్రటేరియట్ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌మహబూబ్ బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులిబండ్ల నరసింహరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు అవార్డులు, రివార్డుల కోసం అత్యుత్సాహం చూపిస్తూ సచివాలయ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు మండిపడ్డారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్-3 కమిషనర్ చక్రవర్తి సచివాలయ ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అధికారుల అత్యుత్సాహానికి మరొక సచివాలయ ఉద్యోగి బలికా కూడదని, సచివాలయ ఉద్యోగులు ప్రశాంతమైన వాతావరణంలో పనిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

ఓబుళదేవరచెరువు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల అంజనేయనాయుడు తెలిపారు. సుమారు 400 మంది మాలదారులకు మండల కేంద్రానికి చెందిన టిన్ను మల్లికార్జున రెడ్డి, కుసుమవారిపల్లి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

తనకల్లు, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొక్కంటి క్రాస్‌లో సత్యన్న సేనా సభ్యులు ఆదివారం ఏడుగురు గర్భిణులకు ఆరురకాల పౌష్టికారాన్ని అందించారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్ఫూర్తితో సత్యన్న సేనను ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వారు తెలిపారు. అమృత పౌష్టికాహారాన్ని నిరుపేద గర్భిణులకు ప్రసవం అయ్యేవరకు అందజేస్తామని వారు తెలిపారు.

అపరిశుభ్రత నడుమ నీటి ట్యాంకు



వేపరాల్లలో తాగునీటి ట్యాంక్‌కు పాచిపట్టిన దృశ్యం

గాండ్లపెంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి అద్దంపట్టే విధంగా మండలంలోని వేపరాల్ల గ్రామంలోని తాగునీటి ట్యాక్ దర్శనమి స్తోందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. వేపరాల్ల పంచాయతీలో సుమారు వందకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలోని పంచాయతీ తాగునీటి ట్యాంక్ నీటినే వారు తాగడానికి వినియోగిస్తారు. ఆ తాగునీటి ట్యాంక్‌ను ప్రతి 15 రోజులకు లేదా నెలకు ఒకసారి అయినా శుభ్రం చేసే బాధ్యత పంచాయతీ అధికారులకు, పాలకులపై ఉంటుంది. దీనిని పై అధికారులు కూడా పర్యవేక్షించాలి, అయితే అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వల్ల వేపరాలలోని తాగునీటి ట్యాంక్‌ను ఏడాది ఒక సారి కూడా శుభ్రం చేసిన దాఖలాలు లేవు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులకు నిధు లు అందిస్తున్నా నిత్యం గ్రామానికి తాగునీరు అందించే ట్యాంక్ శుభ్రతపైన కూడా నిర్లక్ష్యం వహిస్తుండడం శోచనీయమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అపరిశు భ్రంగా ఉంటే ప్రజలు అనారోగ్యాల భారిన పడి ఆసుపత్రి పాలయ్యే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు. ఈ ఏడాది కూడా వేపరాల్ల పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4 లక్షలకు పైగా విడుదలయ్యాయని, ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంక్‌లతో పాటు పరిసరాలను శుభ్రం చేసి ప్రజలు రోగాల భారినపడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ధర్మవరంలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు, సాయిభక్తులు



బత్తలపల్లిలో సత్యసాయి విగ్రహనికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు



బుక్కపట్నంలో అన్నదానం చేస్తున్న యువత

ఘనంగా సత్యసాయి శతజయంతి వేడుకలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను ధర్మవరం పట్టణం, మండలంతో పాటు కదిరి, బుక్కపట్నం, బత్తలపల్లి, తాడిమర్రి తదితర మండలాల్లో ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, సత్యసాయి భక్తులు సత్యసాయి బాబా విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మవరంలో టీడీపీ నాయకుడు భీమనేని ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ.....సత్యసాయిబాబా జయంతి సందర్భంగా సత్యసాయిసేవా కమిటి ఆధ్వర్యంలో ప్రతిఏటా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.



కదిరి మండలం ఏడిగడ్డ తండాలో అన్నదానం



తాడిమర్రిలో సాయినామ సంకీర్తన చేస్తున్న భక్తులు



తాడిమర్రిలో కేక్ కట్ చేస్తున్న సత్యసాయి కార్మికులు



కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై కమ్మేసిన పొగమంచు



ఓబుళ దేవర చెరువు వీధుల్లో మంచు

ఈ... ఉదయం..!

సూర్యుడి కిరణాల కాంతిలో పొగమంచు గీసిన ప్రకృతి రమణీయ చిత్రం ఇది. ఓబుళదేవరచెరువులో ఆదివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. జనం చలికి వణికిపోతూనే ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. ఉదయం 8 గంటలైనా పొగమంచు వీడట్లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై పొగమంచు కారణంగా ఉదయం కూడా లైట్లు వేసుకుని వెళ్తున్నారు.

-ఓబుళదేవరచెరువు(ఆంధ్రజ్యోతి)

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సం ఘటన ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆదివా రం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మే రకు.. పట్టణం లోని తారకరామాపురానికి చెందిన పసుపు లేటి శ్రీనివాసులు(38) అనే వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం-1లో నాం దేడ్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివా సులుకు 15 సంవత్సరాల క్రితం వివాహమై ఏడాదికే విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తండ్రి లక్ష్మీనారాయణతో కలిసి నివసిస్తున్నాడు. తల్లి 12 సంవత్సరాల క్రితం మృతిచెందింది. తండ్రి, కుమారుడు మాత్రమే ప్రతి రోజు కూలి పనులకు వెళ్లి వంట చేసుకుని నివసిస్తున్నారు. గత కొంతకాలంగా ఇలా సమయానికి అన్నం పెట్టేవారు లేరని శ్రీనివాసులు బాధపడేవారు. శనివారం రాత్రి తండ్రి లక్ష్మీనారాయణ అన్నం చేయలేదని కుమారుడు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేస్తూ వాదనకు దిగాడు. బయటకు వెళ్లి హోటల్‌లో తినుపో అని తండ్రి చెప్పడంతో.. శ్రీనివాసులు బయటకు వెళ్లి తెల్లవా రుజామున రైల్వేస్టేషన్‌లో నాందేడ్ రైలు ఎక్స్‌ప్రెస్ కింద పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మద్యం దుకాణం దగ్ధం

తాడిమర్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలాజీ వైన్స్‌షాపు శనివారం రాత్రి సమయంలో అగ్నికి ఆహుతైంది. రాత్రి 11గంటల సమయంలో మద్యం దుకాణం నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు షాపు యజమానికి సమాచారం అందించారు. అలాగే వారు స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ.... అప్పటికే దుకాణంలోని రూ.లక్షలు విలువైన మద్యం బాటిళ్లు దగ్ధమయ్యాయి. వీటికి తోడు దుకాణం పైభాగం తలుపులు, కంప్యూటర్ పూర్తిగా కాలిపోయినట్టు బ్రాంది షాపు నిర్వాహకులు తెలిపారు.

ధర్మవరంలో చోరీలు

ధర్మవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాలలో చోరీలు జరిగాయి. మారుతినగర్‌లో చికెన్‌సెం టర్ నిర్వాహకుడు గుర్రం నరసింహ తన తమ్ముడు నిశ్చి తార్థం కోసం శనివారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి ఇందిరమ్మకాలనీకి వెళ్లాడు. ఇది గమనించిన గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించి జత కమ్మలు, ఒక ఉంగరం, రూ.30వేలు నగదును అపహరిం చుకుని వెళ్లారు. ఆదివారం ఉదయం నరసింహ అల్లుడు దుస్తుల కోసం ఇంటికి రాగా తలుపులు పగలకొట్టి ఉండ టంతో లోపలికి వెళ్లి చూశాడు. ఇంట్లో దొంగతనం జరిగిన ట్టు అతడు ఇంటి యజమాని నరసింహకు తెలియజేశాడు. అదేవిధంగా వన్‌టౌన్ పరిధిలోని గాంధీనగర్‌లో నరేంద్ర గుప్తకు చెందిన దత్తా ఆన్‌లైన్ సర్వీసు కార్యాలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకిపాల్పడ్డారు. కార్యాలయం ష టర్‌ను పగలకొట్టి లోపలికి వెళ్లి రూ.25వేలు దొంగలించినట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘట నా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎస్.రాయాపురంలో ...

గుడిబండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయాపురం గ్రామంలో పలువురి ఇళ్లలో చోరీలు జరిగినట్లు బాధితులు మహాలింగప్ప, ఈరన్న, భాగ్యమ్మ తెలిపారు. శనివారం రాత్రి భాగ్యమ్మ ఇంటి వద్ద ఇనుప జాలర్లలో ఉన్న మూడు కోళ్లను తాళాలు పగలకొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అలాగే ఈరన్నకు చెందిన మూడు కోళ్లు, మహాలింగప్పకు చెందిన మేకను అపహరించారు. మేక విలువ రూ.15వేలు, కోళ్ల విలువరూ.7వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి రాత్రివేళ్లలో గస్తీ నిర్వహించి దొంగతనాలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా నీటి శుద్ధి కేంద్రాలు



ఆకుతోటపల్లి వద్ద నిరుపయోగంగా నీటి శుద్ధి కేంద్రం

ఓబుళదేవరచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం బాగు కోసం ఫ్లోరైడ్ రహిత నీటిని ప్రజలకు అందించాలనే ఉద్దేశ్యంతో గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంక్రింద రూ. 2లకు 20 లీటర్ల శుద్ధినీటిని పంపిణీచేసే విధంగా బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా ఓబుళదేవరచెరువు సమీపంలోని ఆకుతోటపల్లి వద్ద తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేసి యంత్రాలను సమకూర్చింది. అప్పట్లో ప్రధాన పంప్‌హౌస్ నుంచి బోగానిపల్లి వద్ద ఏర్పాటుచేసిన ఉపకేంద్రం ద్వారా గ్రామాలకు నీరు సరఫరా చేసే విధంగా ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి బాబాసాహేబ్‌పల్లి, తుమ్మలకుంటపల్లి తదితర గ్రామాల్లో శుద్ధి నీటి సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ రూ. 2 కాయిన్‌ను బాక్స్‌లో వేస్తే నీరు వచ్చే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ఏ మాత్రం పట్టించుకోక పోవడంతో ఆ కేంద్రం ప్రారంభానికే నోచుకోలేదు. శుద్ధి జల కేంద్రంలో యంత్రాలు తుప్పుపట్టి నిరూపయోగంగా మారా యి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా పక్కన పెట్టేయ డంతో ప్రజలు నీటికి ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. గడిచిన ఐదు సంవత్సరాల నుంచి నీటి ట్యాంక్‌ల ద్వారా వచ్చే నీటిని బిందె రూ. 10 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది.



తుప్పు పడుతున్న పరికరాలు

ఫ్లోరైడ్‌తో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఫ్లోరైడ్‌తో మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేకపోవడంతో గ్రామాలకు వచ్చే నీటి ట్యాంక్‌ల ద్వారా రూ. 10తో బిందె నీరు కొనుగోలు చేస్తున్నారు. స్థోమత లేనివాళ్లు స్థానకంగా వచ్చే నీటిని వాడుతూ ఫ్లోరైడ్‌తో ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా కీళ్ల నొప్పులు, నడుము నొప్పులతో యువకులు సైతం బాధపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2018లో తెలుగుదేశం ప్రభుత్వం శుద్ధమైన నీరు అందించాలన్న సంకల్పంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ఏర్పాటుచేసింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఏమ్రాతం పట్టించుకోలేదు. దీంతో ఫ్లోరైడ్ పీడిత గ్రామాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తే గ్రామీణులకు నీటి కష్టాలు, ఫ్లోరైడ్ సమస్యలు తీరుతాయని ప్రజలు అంటున్నారు.

శుద్ధినీరు అందించాలి



ఫ్లోరైడ్ పీడత గ్రామాలకు శుద్ధినీరు అందించే కార్యక్రమాన్ని తిరిగి చేపట్టాలి. గతంలో టీడీపీ ప్రభుత్వం శుద్ధినీటిని అందించేందుకు ఎన్టీ ఆర్ సుజల పథకాన్ని పెట్టినా, దానిని వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు విస్మరించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుద్ధి చేసిన నీటిని గ్రామాలకు అందించాలి.

-కె. రామాంజనేయులు, బాబాసాహెబ్‌పల్లి

నొప్పులతో అల్లాడిపోతున్నాం



శుద్ధినీరు సరఫరా కాకపోవడంతో ఫ్లోరైడ్ సమస్యతో నొప్పులకు అల్లాడిపోతున్నాం. ఆ బాధలు పడలేక ట్యాంక్‌ల ద్వారా రూ. 10 పెట్టి శుద్ధినీరు కొంటున్నాం. ప్రభుత్వం శుద్ధి జల కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తే ఖర్చుల భారం తగ్గడంతో పాటు పరిశుద్ధమైన తాగు నీరు అందుతుంది.

-రెడ్డిపల్లి సరస్వతమ్మ, నారప్పగారిపల్లి

పార్కు, బస్సు షెల్టర్ ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన పుటపర్తి ఆర్టీసీ డిపో సమీపంలో నిర్మించిన సాయి గోకులం పార్క్‌ను, ప్రయాణికుల సౌకర్యార్థం చిత్రావతి బ్రిడ్జి సమీపంలో నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయ రామాంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్త చలపతి, నూరి, షామీర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక భక్తుల ఇబ్బందులు



పుట్టపర్తికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ధర్మవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో జరిగిన సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలకు వెళ్లడానికి వివిధ ప్రాంతా ల నుంచి వచ్చిన భక్తులు నానా అగచాట్లు పడ్డారు. పుట్టపర్తికి వెళ్లాలని ఆదివారం ఉదయం వివిధ ప్రాంతాల నుంచి ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే ఆర్టీసీ బస్సులు తగినన్ని రాకపోవ డంతో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. వచ్చిన బస్సులు కూడా ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. కనీసం నిలబడటానికి కూడా స్థలంలేక ఇబ్బందులుపడ్డారు. ఇలాంటి ఉత్సవాల కు అధికసంఖ్యలో బస్సులను ఏర్పాటుచేయాలని ప్రయాణికులు, సాయిభక్తులు కోరుతున్నారు.

నన్ను ఉపయోగించుకోండి



రోడ్డు విస్తరణలో పూడిపోయిన చేతి పంపు

ఇటీవల జరిగిన రోడ్డు విస్తరణలో మండలంలోని వనుకువారిపల్లి కొత్తరోడ్డు వద్ద ఉన్న చేతి పంపు పూడిపోయింది. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగిన దృష్ట్యా చేతి పంపు స్థానంలో మోటారు అమర్చితే తమకు నీటి సమస్య తీరుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చేతిపంపులో నీటిశాతాన్ని పరిశీలించి ఉపయోగిం చుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- ఓబుళదేవరచెరువు(ఆంధ్రజ్యోతి)

ఉద్యోగోన్నతుల్లో న్యాయం చేయాలి

● గ్రామ పంచాయతీ కార్యదర్శుల వినతి



ఓఎస్డీ వెంకట కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కదిరి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల విషయంలో పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం న్యాయం చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణ ఆదివారం కదిరికి వచ్చిన సందర్భంగా ఆయనను కలసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన డిప్యూటీ ఎంపీడీఓల పదోన్నతులలో జోన్- 4లో ఉన్న గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అన్యాయం జరిగిందన్నారు. పదోన్న తులలో కార్యదర్శులకు ఉన్న కోటాలో వారికి ఇవ్వకుండా మినిస్టీరి యల్ స్టాఫ్‌కు 80 శాతం ఇవ్వడంలో జోన్ -4లో ఉన్న కార్యదర్శులకు పదోన్నతులు దక్కడం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శులకు రావలసిన పర్సంటేజ్ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు రామ్మోహన్, విశ్వనాథ రెడ్డి, విజయ్, భాస్కర్, గోపినాథ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



రోడ్డు పక్కన వృథాగా పారుతున్న తాగునీరు

అమడగూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహమ్మదాబాద్ మూడు రోడ్లు కూడలిలో హోటల్ యజమానులు ఏర్పాటుచేసుకున్న తాగునీటి పైప్‌లైన్ పగిలింది. ఈ రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డు పక్కనే తక్కువలోతులో పైప్‌లైన్ ఉండడంతో ఆ వాహనాలు వెళ్లినప్పుడు పైప్‌లైన్ పగిలిపోయే అవకాశం ఉంది. గతంలోనూ ఈ సంఘటన జరిగింది. మళ్లీ రెండు రోజులక్రితం పైప్‌లైన్ పగిలిపోవడంతో రోడ్డుపక్కన తాగునీరు వృథాగా పారుతోంది. దీంతో అటూ ఇటూ వచ్చే వాహనాలు తారు రోడ్డు దిగాలంటే ఇరుక్కుపోతామని భయపడాల్సి వస్తోంది. ఈ రహదారిలో ఎక్కువగా అధిక లోడుతో ఉన్న వాహనాలు వెళ్తుంటాయి. అధికారులు స్పందించి పైపులైన్ కు మరమ్మతులు చేయాలని, తాగునీటి వృథాను అరికట్టాలని వాహనదారులు, ప్రజలు తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి జానకిని వివరణ కోరగా గతంలో పైప్‌లైన్ పగిలినప్పుడే హోటల్ యజమానులను హెచ్చరించినా తీరు మారలేదని పేర్కొ న్నారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా కనకదాస జయంతి



జ్యోతులు మోసుకొస్తున్న మహిళలు

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట గ్రామంలో ఆదివారం కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి సచివాలయం వద్ద ఉన్న కనకదాస విగ్రహానికి సమర్పించారు. టీడీపీ స్థానిక నాయకులు మాట్లాడుతూ కురుబలకు ఎంతో ఆదర్శప్రాయుడిగా నిలిచిన కనకదాస జయంతి జరపడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, దొడ్డయ్య పాల్గొన్నారు.



ప్రదర్శనగా వస్తున్న కురుబ సంఘం నాయకులు

లేపాక్షి (ఆంధ్రజ్యోతి): కురుబల ఆరాధ్యదైవం కనకదాస జయంతిని ఆదివారం కల్లూరులో ఘనంగా నిర్వహించారు. కనకదాస చిత్రపటానికి పూలమాలలువేసి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వెళ్లి తమ భక్తిని చాటుకున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, టీడీపీ మండల కన్వీనర్ వెంకటాపురం అభి హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కృపాసత్యరాజ్

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన క్రీడాపోటీల్లో పరిగి ఉన్నత పాఠశాలకు చెందిన హర్షవల్లి, గంగమ్మ ఫుట్‌బాల్, మంజుల, హ్యాండ్‌బాల్ సిరివల్లి, రగ్బీ స్వాతి, వర్షిత, నవరత్న, నవకిషోర్, లలిత కిషోర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వినోద్‌కుమార్ తెలిపారు. ఎంతోకాలంగా క్రీడల్లో ప్రతిభను కనబరుస్తూ చదువుతోపాటు క్రమశిక్షణ, అన్నిరంగాల్లో ముందుకెళ్తూ పాఠశాలకు పేరుతెస్తున్న విద్యార్థులను హెచ్‌ఎం కృపాసత్యరాజ్ అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, జేవీవీ సభ్యులు

పెనుకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న గ్లోబుల్‌జెన్ సీబీఎస్ఈ విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పదోతరగతి విద్యార్థి కౌసర్, తొమ్మిదో తరగతి లీశ, ఎనిమిదో తరగతి అక్షర్ గగన్‌రెడ్డి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని కరస్పాండెంట్ శ్రీనివాసులుతోపాటు గేయానంద్, ఎంఈఓలు అభినందించారు.

మత్తు వద్దు.. జీవితం ముద్దు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

మడకశిర రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మత్తు వద్దు.. జీవితం ముద్దు అని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. కళాశాల ఆధ్వర్యంలో మెళవాయి గ్రామంలో ఏడు రోజుపాటు ఎన్‌ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు చైతన్య కోసం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమంపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు మద్యం, మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిషా ముక్త్.. భారత్ అభియాన్ కార్యక్రమాన్ని మత్తు వద్దు జీవితం ముద్దు అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహంచారు. వైస్ ప్రిన్సిపాల్ హేమలత, ప్రోగాం ఆఫీసర్ క్రిష్ణప్ప, అధ్యాపకులు మురళి, సర్పంచు రంగనాథ్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల్లో న్యాయం చేయాలి

కదిరి అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల విషయంలో పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం న్యాయం చేయాలని గ్రామపంచా యతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణ ఆదివారం కదిరికి వచ్చిన సందర్భం గా ఆయనను కలసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన డిప్యూటీ ఎంపీడీఓల పదోన్నతులలో జోన్- 4లో ఉన్న గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అన్యాయం జరిగిందన్నారు. పదోన్నతులలో కార్యదర్శు లకు ఉన్న కోటాలో వారికి ఇవ్వకుండా మినిస్టీరి యల్ స్టాఫ్‌కు 80 శాతం ఇవ్వడంలో జోన్ -4లో ఉన్న కార్యదర్శులకు పదోన్నతులు దక్క డం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శులకు రావలసిన పర్సంటేజ్ ప్రకా రం పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు రామ్మోహన్, విశ్వనాథ రెడ్డి, విజయ్, భాస్కర్, గోపినాథ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లయినా పూర్తికాని ప్రభుత్వ గృహాలు..!

● అనువుగాని చోట స్థలాల కేటాయింపు
● ముందుకురాని లబ్ధిదారులు

సోమందేపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో పేద ప్రజలకు గత ప్రభుత్వ హయాంలో మంజూరైన గృహాలు ఐదేళ్లయినా పూర్తీకాలేదు. ప్రభుత్వం ఇటీవల జగనన్న కాలనీని ఎన్టీఆర్ నగర్‌గా పేరు మారుస్తూ జీవో విడుదల చేసింది. అయినా గృహనిర్మాణాలు ముందుకు సాగడంలేదు. కొన్ని ప్రాంతాల్లో అనువుగానిచోట స్థలాలు కేటాయించారు. దూరాభారం, వసతులు కల్పించకపోవడం, చాలా మంది లబ్ధిదారులు ఇళ్లనిర్మాణానికి ముందుకు రావడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.లక్ష దాకా అదనంగా రుణ సాయం అందిస్తున్నా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. గత ఏడాది మన ఇల్లు మన గౌరవం పేరిట ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో 82 గృహాలు మాత్రం కొత్తగా నిర్మించారు. చాలా మందికి గృహనిర్మాణాలకు సంబంధించిన బిల్లులు అందకపోవడంతో మరికొందరు అప్పులుచేసి ఇల్లు నిర్మించుకోలేక నిర్మాణాలు ఆగిపోయాయనే ఆరోపణలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 9 ప్రభుత్వ లేఅవుట్లలో పేదలకు పట్టాలు అందించారు. బుసయ్యగారిపల్లి 21 ప్లాట్లు వేయగా 13 మంజూరయ్యాయి. మూడు మాత్రమే పూర్తయ్యాయి. బేస్‌లెవెల్ 6, లింటెల్ 1, రూఫ్‌లెవెల్ 2, ఒక ప్లాట్ ఖాళీగా ఉంది. అలాగే మాగేచెరువులో 44పాట్లకు 34మంజూరు, 18 నిర్మానాలు పూర్తీకాగా, బేస్‌మెంట్ 11, రూఫ్‌లెవెల్ 4, 10 ఖాళీగా ఉన్నాయి. సోమందేపల్లి పంచాయతీ పాపిరెడ్డిపల్లిలో 70పట్టాలకుగాను 35మంజూరు, మూడు మాత్రమే పూర్త



వృథాగా పాపిరెడ్డిపల్లి లే అవుట్

య్యాయి. 32ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. సోమందేపల్లి పంచాయతీ నక్కలగుట్ట కాలనీలో 70పట్టాలకుగాను 57మంజూరయ్యాయి. 29పూర్తీ కాగా, బేస్‌లెవెల్ 23, రూఫ్‌లెవెల్ 4, ఖాళీలు 13ఉండగా ఒకటి ప్రారంభం కాలేదు. చాకర్లపల్లి లేఅవుట్‌లో 693 పట్టాలుండగా 578 మంజూరు, 250 పూర్తీకాగా బేస్‌లెవెల్ 176, లింటెల్ 13, రూఫ్ 36, ఖాళీలు 115, రూఫ్ క్యాస్ట్ 1, ప్రారంభం కానివి రెండున్నాయి. అలాగే పందిపర్తిలో 42 పట్టాల్లో 27 మంజూరు, 20పూర్తీకాగా బేస్‌లెవెల్ 1, లింటెల్ 1, రూఫ్‌లెవెల్ 1, రూఫ్‌క్యాస్ట్ 1 ఉన్నాయి. కేతగానిచెరువు 42పట్టాలు, 25మంజూరు, 17పూర్తీ, బేస్‌లో 7, ప్రారంభం కానివి 1ఉన్నాయి. చాలకూరు-1లో 18పట్టాలకు 2మంజూరయ్యాయి. రూఫ్ 1, లింటల్‌లెవెల్1 ఉన్నాయి. చాలకూరు-2లో 48పట్టాలకు 8మంజూరు, ఆరు పూర్తీకాగా 1లింటల్, 1రూఫ్‌లెవెల్‌లో ఉన్నాయి. స్థలాలుండి ఇళ్లనిర్మాణాలకు పీఎంఏవై గ్రామీణం కింద 1105దరఖాస్తులు వచ్చాయి. దాదాపు 300సర్వేపూర్తీకాగా 700కుపైగా సర్వేచేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం తప్ప లబ్ధిదారులకు సరైన వసతులు కల్పించడంలో విఫలమైంది. అదేవిధంగా పాపిరెడ్డిపల్లి లేఅవుట్ కొండ వెనుకభాగంలో వేయడంతో ఇంతవరకు ఒక లబ్ధిదారుడు కూడా గృహప్రవేశం చేయలేదు. అక్కడ నిర్మాణాలకు సైతం విముఖత చూపుతున్నారు. పూర్తిస్థాయిలో ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్నవి సగానికి తక్కువేనని చెప్పాలి. దీనిపై హౌసింగ్ ఏఈ రామాంజనేయులును వివరణ కోరగా వివిధ కారణాలతో లబ్ధిదారులు ముందుకు రావడంలేదన్నారు. తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి మనిల్లు మన గౌరవం ద్వారా 82ఇళ్లు నిర్మించుకునేలా చేశామన్నారు. స్థలాలుండి ఇళ్ల నిర్మాణాలకు వచ్చిన దరఖాస్తులపై సర్వే కొనసాగుతుందన్నారు.



చాకర్లపల్లిలో పిచ్చిమొక్కల నడుమ గృహాలు

నేటి నుంచి రైతన్నా.. మీకోసం

అమరాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి 27వ తేదీ వరకు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖాధికారి మంజునాథ్ తెలిపారు. వ్యవసాయరంగాన్ని ముందుకు నడిపించేందుకు, రైతుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నారన్నారు. రైతులకు సీఎం తెలిపిన పంచసూత్రాలను తెలియజేసే కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతును రాజును చేసేందుకు కూటమి ప్రభుత్వం ఇంటింటి సర్వేను సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు అగ్రికల్చర్ ఏఓ చందన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రానున్న ఐదేళ్లలో ఏం చేయబోతుందనేది వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల ద్వారా వివరిస్తారన్నారు. వారం రోజులపాటు రైతు సేవలో భాగంగా ఇంటింటి సర్వేను చేపడతారన్నారు.


సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఓ విజయభారతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి పల్లెలో ఇంటింటికి వెళ్లి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లాభసాటి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలో రైతన్నా మీకోసం కార్యక్రమం సోమవారం నుంచి వచ్చేనెల 2వరకు నిర్వహిస్తున్నట్లు ఏఓ సురేంద్రనాయక్ తెలిపారు. ప్రతి గ్రామంలోనూ రైతు ఇంటికి వెళ్లి సర్వే చేస్తామన్నారు. రానున్న ఐదేళ్లలో ప్రభుత్వం ఏమి చేయబోతుందో వ్యవసాయ, అనుబంధ శాఖలు రైతులకు వివరించాలన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

హిందూపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయంవద్ద సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పీఏ వీరయ్య తెలిపారు. మండలంలోని ప్రజలు, ప్రజా సమస్యలపై అర్జీలు ఇవ్వాలని, మండలంలోని అన్నిశాఖల అధికారులు పాల్గొంటారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



పూలకుంట నాయకులతో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు ఎవరికిచ్చినా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంవద్ద పూలకుంట పంచాయతీ తెలుగుదేశం నాయకులతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పనిచేసిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుని న్యాయం చేస్తామన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో అదేవిధంగా పనిచేయాలన్నారు. రిజర్వేషన్లబట్టి అభ్యర్థులుంటారన్నారు. ఏ కార్యకర్తకు, నాయకుడికి కష్టం వచ్చినా ఎమ్మెల్యే అండగా ఉంటారన్నారు. మండల కన్వీనర్ హెచ్ఎన్ రాము, మండల కోఆర్డినేటర్ మంజునాథ్, నాయకులు రామక్రిష్ణారెడ్డి, పాపన్న, శ్రీనివాసులు, గంగాధర్ పాల్గొన్నారు.

పాఠశాల అనుమతి రద్దు

పావగడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని తిప్పయిన దుర్గంలో ఉన్న ఆకర్షణ ఉన్నత పాఠశాల అనుమతి రద్దుచేస్తూ లోకాయుక్త, విద్యాశాఖ కమిషన్ నుంచి ఆదేశాలు అందాయి. 8 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 30 నుంచి 40మంది యాదగిరి జిల్లాకు చెందిన విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారు. వసతి సౌకర్యాలుంటాయని నమ్మించిన యాజమాన్యం వారికి సరైన ఆహారం, వసతి, విద్యా బోధనలు, మరుగుదొడ్లు కల్పించలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురైన విద్యార్థులు లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లడంతో వారి సమస్య పరిష్కారమైంది.

'సేవాపేక్షతో వైద్యం అందిస్తాం'



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న వెంకటరమణనాయక్ దంపతులు

హిందూపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): లాభాపేక్షతో కాకుండా సేవాపేక్షతో వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ వెంకటరమణనాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో జతిన్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. రాజకీయ పార్టీల నాయకులు, పలువురు వైద్యులు ఆయనను అభినందించారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం తక్కువ ధరకే అందిస్తామని లాభాలను దృష్టిలో పెట్టుకోకుండా సేవతో పనిచేస్తామన్నారు.

గానవికి బంగారం పతకం

పావగడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డికాలనీలో నివాసముంటున్న విశ్రాంత ఏఎస్ఐ సిద్దప్ప సువర్ణమ్మ దంపతుల కుమార్తె గానవికి ఇంజనీరింగ్‌లో బంగారు పతకం లభించింది. తుమకూరులోని హెచ్‌ఎం గంగాధరయ్య స్మారక భవనంలో జరిగిన సిద్ధార్థ అకాడమి ఆఫ్ ఇయర్ ఎడ్యుకేషన్ తరుపున 14వ వార్షికోత్సవాల్లో బీఈలో విద్యార్థినికి బంగారు పతకాన్ని అందించి సంస్థ తరుపున గౌరవించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలను వీఎస్ విద్యాసంస్థలో అభ్యసించిన గానవి ఎంతో కృషితో బంగారు పతకం సొంతం చేసుకున్నందుకు తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మడకశిర టౌన్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మధుగిరి రోడ్డులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మధుగిరి రోడ్డు చెక్కు పోస్టు సమీపంలో కాలినడకన వస్తున్న యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. అటువైపు వెళ్లే బాటసారులు గమనించి 108కు సమాచారం అందించారు. వెంటనే మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడికి సంబంధించిన వివరాలు తెలియలేదు. కొందరు రాజస్థానుకు చెందిన యువకుడిగా చెబుతున్నారు. పోలీసులు విచారిస్తున్నారు.

ఎస్.రాయాపురంలో చోరీలు

గుడిబండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయాపురం గ్రామంలో పలువురి ఇళ్లలో చోరీలు జరిగినట్లు బాధితులు మహాలింగప్ప, ఈరన్న, భాగ్యమ్మ తెలిపారు. శనివారం రాత్రి భాగ్యమ్మ ఇంటి వద్ద ఇనుప జాలర్లలో ఉన్న మూడు కోళ్లను తాళాలు పగలకొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అలాగే ఈరన్నకు చెందిన మూడు కోళ్లు, మహాలింగప్పకు చెందిన మేకను అపహరించారు. మేక విలువ రూ.15వేలు, కోళ్ల విలువ రూ.7వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి రాత్రివేళ్లలో గస్తీ నిర్వహించి దొంగతనాలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మద్యం దుకాణం దగ్ధం

తాడిమర్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలాజీ వైన్స్‌షాపు శనివారం రాత్రి సమయంలో అగ్నికి ఆహుతైంది. రాత్రి 11గంటల సమయంలో మద్యం దుకాణం నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు షాపు యజమానికి సమాచారం అందించారు. అలాగే వారు స్పందించి అగ్నిమాసక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ.... అప్పటికే దుకాణంలోని రూ.లక్షలు విలువైన మద్యం బాటిళ్లు దగ్ధమయ్యాయి. వీటికి తోడు దుకాణం పైభాగం తలుపులు, కంప్యూటర్ పూర్తిగా కాలిపోయినట్టు బ్రాంది షాపు నిర్వాహకులు తెలిపారు.

సైన్స్ సబ్జెక్ట్ కాదు.. అది జీవన విధానం

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

పెనుకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సైన్స్ ఓ సబ్జెక్ట్ కాదని, అది జీవన విధానమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆదివారం స్థానిక గ్లోబుల్‌జెన్ సీబీఎస్ఈ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ సైన్స్ అనే ది జీవితంలో ఒక భాగంగా ఉండాలన్నారు. చదువుకున్న చదువు ఆలోచనా శక్తిని ప్రశ్నించే లక్షణాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే ఈ దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్థాయికి సైన్స్ అభివృద్ధి చెందినా చదువుకున్న మేధావులే మూఢనమ్మకాల బారినపడి నష్టపోతున్నారన్నారు. అందుకే ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ఈదేశంలో పుట్టి పెరిగి ఇక్కడే ప్రయోగాలు చేసిన ఏ శాస్త్రవేత్తకు కూడా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నోబుల్ బహుమతి రాలేదంటే శాస్త్ర పరిశోధనలకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తోందో తెలుస్తుందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి అంతా సైన్స్ ప్రతిఫలమేనన్నారు. మనుషులకు నష్టం కలిగించే ఏ నమ్మకాన్నాయినా ప్రతి ఒక్కరూ ప్రశ్నించకపోతే మానవజాతి మనుగడకు పెద్దముప్పు వాటిల్లుతుందన్నారు. జిల్లా కార్యదర్శి నబీ, కరస్పాండెంట్ ప్రగతి శ్రీనివాసులు, గుట్టూరు హెచ్‌ఎం నాగార్జున, యూటీఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణస్వామి, జేవీవీ జిల్లా కార్యదర్శి లోకేష్, రమేష్, రవీంద్ర, కేశప్ప, ఓబులేస్ తదితరులుపాల్గొన్నారు. అనంతరం జేవీవీ డివిజన్ కార్యదర్శి నబీ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది.



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

సత్యసాయి సేవలు మరువలేనివి: టీడీపీ



బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు



బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎస్ఎస్ మూర్తి, భజనమండలి సభ్యులు

పెనుకొండ టౌన్/పెనుకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా చేసిన సేవలు మరువలేనివని టీడీపీ కన్వీనర్ శ్రీరాములు అన్నారు. ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ పుట్టపర్తిలో వేల మంది విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను ఉచితంగా అందించిన మహానుభావుడన్నారు. బాబుల్‌రెడ్డి, మీసేవా సమి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నంజుండ పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహక్కుల పరిరక్షణ సమితి డివిజన్ అధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో సత్యసాయి భజనమండలి సభ్యులు బాబా చిత్రపటానికి పూజలు నిర్వహించారు. సభ్యులు రత్నాకరన్ మురళిధర్‌రాజు, లక్ష్మీరాంనాయక్, సరోజమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

హిందూపురం(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాండురంగనగర్‌లో శ్రీసత్యసాయి నిలయంలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ రమేష్ హాజరై మాట్లాడుతూ సాయిబాబా ప్రేమ, సేవ, నైతిక ఆధ్యాత్మికతను భక్తులకు బోధించారన్నారు. రాయలసీమలాంటి కరువు ప్రాంతాలకు దాహార్తిని తీర్చిన మహనీయుడు అన్నారు.



గుమ్మయ్యగారిపల్లిలో బాబా జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పుట్టపర్తి సత్యసాబాబా శతజయంతి వేడుకలను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. బూదిలి గ్రామంలో సత్యసాయి చిత్రపటానికి పూజలు చేసి, కంసల మీనాక్షి, వేణుగోపాలాచారి దంపతులు ఆనవాయితీ ప్రకారం అన్నదానం చేశారు. గోరంట్లలోని బస్టాండ్ కూడలిలో భక్తి కీర్తనలు, భజనలు చేశారు. భక్తులు పులేరు హరి, డాక్టర్ రామయ్య, నిమ్మవిద్యాధరణి, సుబ్బరాయుడు అల్పాహారం పంపిణీ చేశారు. గుమ్మయ్యగారిపల్లి మారెమ్మ ఆలయంలో అర్చకులు దేవరాజుస్వామి ఆధ్వర్యంలో బాబా ప్రవచనాల పుస్తకాలను ప్రజలకు పంపిణీ చేస్తూ, ఆయన బోధనలను పాటించాలన్నారు.



జయంతి వేడుకల్లో రమానందన్ తదితరులు

లేపాక్షి(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి వేడుకలను ఆదివారం నాగానిపల్లిలో లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలువేసి కేక్‌కట్‌చేశారు. చిన్నారులు సాయిబాబా వేషధారణలో అలరించారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం సాయిబాబా చిత్రపటాన్ని ఊరేగించి సంబరాలు జరుపుకున్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

● ఇబ్బంది పడుతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు



ఆర్. మరువపల్లిలో రోడ్డుపై తిరుగుతున్న వీధికుక్కలు

రొద్దం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ద్విచక్రవాహనదారులు రోడ్డుపై వెళ్తుంటే వెంటబడుతున్నాయి. తప్పించుకునే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అనేక గ్రామాల్లో రోడ్లపై వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇటీవల సుప్రీం కోర్టు వీధి కుక్కలను కట్టడి చేయాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. కొన్నిచోట్ల పిల్లలపై దాడులు చేస్తున్న ఘటనలు కోకొల్లలు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ల మంజూరు



స్వచ్ఛంద సంస్థ ప్రతినిధికి చెక్కును అందజేస్తున్న మన్నవ మోహన్‌క్రిష్ణ

హిందూపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఆరు మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటుకు ఏపీ టెక్నాలజీ కార్పొరేషన్ లిమిటెడ్ నిధులు మంజూరుచేసింది. కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన్‌క్రిష్ణ ఎన్జీఓ సంస్థ అయిన అసిస్టెకు చెక్కులు అప్పగించినట్లు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. రూ.30లక్షల నిధులతో మోతుకపల్లి, ముద్దిరెడ్డిపల్లి, చౌడేశ్వర కాలనీ, వ్యవసాయ మార్కెట్‌యార్డ్, చిలమత్తూరు మండలం మధురేపల్లి, హిందూపురం మండలం అప్పలకుంట గ్రామంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.